

# నీవు వచ్చేవనీ...నీ పిలుపేవిని

## – విజయరాణి కోడూరి

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### సాధారణ బహుమతి పొందిన నవల

**(గత సంచిక తరువాయి)**

"**ఒకరోజు మేము** ఇంటికి వచ్చేసరికి, మెట్లపైనుండి పడిపోయి గాయమైంది. అప్పుడు నీకు మూడో ఏడు. పరుగులు తీసే వయసునీది. నీ రక్తం చూసి చాలా బాధపడింది వసు. నిన్ను ప్రభావతి దగ్గర వదిలేసి వచ్చింది. నేను వారించాను. ఆమెను నాతో నువ్వు రావద్దు, హేమంత్‌ను చూసుకో, ఆయాలకు అప్పగించవద్దులే" అని.

"తను వినలేదు. నేను అనుకున్న పనులన్నీ ఒక దీక్షతో పూర్తిచెయ్యటంలో నిద్రాహారాలు నిర్లక్ష్యం చెయ్యటంవల్ల నా ఆరోగ్యం కొంచెం హెచ్చరించింది సహకరించక. నాతో వుండి నా ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవటం కోసం నిన్ను ఆయాలకు వదలకుండా ప్రభావతి ఒడికి చేర్చింది మీ అమ్మ.

నా మనసు పొరలలో నుంచి జీవం పోసుకుని రూపం దాల్చిన ప్రతి కార్యక్రమానికి కూడా నాకు తోడుగా నిలిచింది మీ అమ్మ. అలసిన వేళలో అమ్మగా నాకు తన ఒడిలో జోలపాడింది. ఇదిరా హేమంత్ మా కథ. నువ్వు ఈ రోజు అన్నావు, నన్ను పిన్నీ మామయ్యల దగ్గర వదిలేవారని. అవును అది మా వల్ల నీకు జరిగిన అన్యామే. హైస్కూల్‌కు వచ్చేసరికి ఇక్కడకు తీసుకు వచ్చేసాం నిన్ను వదిలి వుండలేక. నీ మనసును చదవలేకపోయానురా నేను. అదంతా నా వల్ల నీకు జరిగిన అన్యాయమే అని ఒప్పుకుంటాను. మమ్మల్ని క్షమించరా హేమంత్" అంటూ అతడిని గుండెకు హత్తుకుని దుఃఖించాడు అభిజిత్. హేమంత్ పొంగి వస్తున్న కన్నీళ్ళను షర్ట్ స్లీవ్‌తో తుడుచుకుంటూ నెమ్మదిగా దూరంగా జరిగాడు.

ఉద్వేగంతో నిండిన ఆ స్థితినుంచి ఇద్దరూ తేరుకున్నారు.

"నా మాటలతో మిమ్మల్ని గాయపరిచాను. నేను మిమ్మల్ని క్షమించటం ఏంటి డాడ్? మీ కడుపున పుట్టినందుకు గర్వంగా వుంది నాకు. ప్లీజ్ నన్ను క్షమించండి" అంటూ అతడి పాదాలను తాకాడు హేమంత్.

అతడిని భుజాలు పట్టి లేవదీసి, "హేమంత్, మై స్వీట్ చైల్డ్" అంటూ గుండెకు హత్తుకున్నాడు అభిజిత్.

తండ్రి అభిజిత్ తనను దగ్గరకు తీసుకున్న స్పర్శను మనసులో అనుభవం చేసుకుంటూ దుఃఖించాడు హేమంత్. అనేక సందర్భాలలో తల్లి ఒడిలో సేద తీరిన సందర్భాలు గుర్తుకు వచ్చాయి అతడికి. తలపై నిమిరే ఆమె చేతి స్పర్శను తలుచుకుని అతడి మనసు దుఃఖిస్తుంది 'అమ్మా...అమ్మా' అని.

అప్రయత్నంగా అతడి చెయ్యి తలపైకి వెళ్ళింది. బాధగా మూలిగింది అతడి మనసు.

నెమ్మదిగా లేచి అల్మారాలో ఉన్న ఆల్బంలో నుంచి, ఒక ఆల్బం తెచ్చి ఒళ్ళో పెట్టుకుని తెరిచాడు. అది వసుమతి పదిలపరచుకున్న ఆల్బం. నెమ్మదిగా తెరిచాడు.

మొదటిపేజీలో ఉన్న గులాబీ రంగు కవర్‌ను తెరిచాడు. బీచ్‌లో సముద్ర కెరటాల వెంట పరుగులు తీస్తున్న సమయంలో తీసిన ఫోటో అది.

'అమ్మా, నాన్నగారు ఎంత సంతోషంగా ఉన్నారు' అతడి కళ్ళు చెమ్మగిల్లాయి. అంతకు ముందు అనేకసార్లు చూసినదే అయినా ఫోటోను వెనక్కు తిప్పి చూశాడు హేమంత్.

'ఐ లవ్ యు మై డియర్ లైఫ్' ఫోటోను గుండెకు హత్తుకున్నాడు. అమ్మను వైజాగ్‌లో వదిలి కలకత్తాకు వెళ్ళేటప్పుడు డాడ్, అమ్మకు ఇచ్చినది ఇదే.

ఒకరినొకరు ఎంతగా ప్రేమించుకున్నారు. తనను వదిలి ఇద్దరూ కలిసే వెళ్ళిపోయారు.

ఆల్బంను తిరిగి అల్మారాలో పెట్టేస్తుండగా, కాలింగ్ బెల్ వరుసగా మోగుతుంది. అతడి మనసు చికాకుకు లోనైంది.

వెళ్ళి డోర్ ఓపెన్ చేశాడు. ఎదురుగా ఒక సిస్టర్ ఉంది. అతడి ముఖంలో భావాన్ని చూసి ఆమె తడబడింది.

"సర్" అంది.

"ఏమైంది?" సౌమ్యంగానే అడిగాడు.

"డాక్టర్ అరుణ్ చాలా సేపట్నుంచి మీకు రింగ్ చేస్తూనే ఉన్నారట. మీరు ఆన్సర్ చెయ్యటంలేదని నన్ను పంపించారు సర్."

"సరే, నువ్వు వెళ్ళు" అని డోర్ మూశాడు. అరుణ్ కాల్స్ ఏడు వున్నాయి. నెమ్మదిగా రింగ్ చేశాడు అతడికి.

"ఏమైంది హేమంత్? ఫోన్ తియ్యవేం? నిద్రపోయేవా?" ఆత్రంగా అడిగాడు అరుణ్.

"ఏం కాలేదు."

"కాసేపు క్రిందకు రారా, ఓపి చాలా రష్‌గా వుంది."

"నాలుగైంది. అసలు ఇంతవరకు ఓపి ఏంటి? క్లోజ్ ఇట్."

ఫోన్ కట్ చేసి సెల్‌ను మంచం మీద పడేసాడు విసుగ్గా. చన్నీళ్ళతో ముఖం కడుక్కున్నాడు. చికాగ్గా ఉంది మనసు. క్యాంటిన్‌కు కాల్ చేసి "కాఫీ" అని చెప్పాడు.

అయిదు నిమిషాలలో కాఫీ వచ్చింది. నెమ్మదిగా తాగాక కాస్త బెటర్ అనిపించింది.

బెడ్‌పై పడుకున్నాడు హేమంత్. అతడి మనసులో మరొక ఆలోచనే లేదు.

"లతా...లతా అసలు ఏమైంది నీకు? ఎందుకిలా అయిపోవావ్? "సమాధానం దొరకక అదే ప్రశ్న అతడి మనసుకు స్థిమితం లేకుండాచేస్తుంది.

'నా దగ్గరకు రావాలని బయల్దేరావ్. థ్యాంక్ గాడ్, ఆ ట్రెయిన్‌లో నేను ఉండబట్టి.. లేకుంటే నువ్వేమైపోదువు..' అతడి కనుకొలకులనుంచి నీళ్ళు జారుతున్నాయి తలగడ పైకి. ఆ ఆలోచనే అతడి గుండెను పిండుతుంది.

'లతా.. నీకు నయమైపోవాలి. నువ్వు లేచి నాతో మాట్లాడాలి. ప్లీజ్ లతా. నాతో ఎప్పటిలా చిలిపిగా మాట్లాడు. లేకుంటే, దెబ్బ మీద దెబ్బ తిని బలహీనమైపోయివున్న నా గుండె ఇక ఏమాత్రం బాధను తట్టుకోలేదు.'

తలుచుకున్న కొలదీ దుఃఖం పొంగి వస్తుంది అతడికి. బాధను దిగమింగుకుని, మనసును జోకొట్టాలని చూశాడు హేమంత్. అతడి ప్రయత్నం ఫలించలేదు. మనసు అతడి మాట వినే స్థితిలో లేదు. గతపు అనుభవాల దొంతరలను తవ్వటం మొదలుపెట్టింది.

'అసలు లత తన జీవితంలోకి ఎందుకు ప్రవేశించింది? ఎలా ప్రవేశించింది. ఇంత మానసిక వ్యధను తనకు మిగల్చటానికా? ప్రశాంతంగా ఉన్న జీవితంలో ఇంద్రధనస్సులా ప్రత్యక్షమైంది. ఆ సంతోషాన్ని శాశ్వతం చేసుకునేలోగానే ఆ రంగులు వెలిసిపోయి తన జీవితం చిన్నబోయింది. ఆమె తన జీవితపు గడపను దాటిపోయింది. బాధగా కళ్ళు మూసుకున్నాడు హేమంత్.

"ఇదా రాగింగ్? రాగింగ్ అంటే కొత్తగా జాయిన్ అయిన వాళ్ళకు బెరుకు లేకుండా చేసేలా స్నేహపూర్వకంగా ఉండాలి" చుట్టూ చేరి అల్లరి చేస్తున్న సీనియర్ మెడికోలతో కోపంగా అంది లత. వైజాగ్ మెడికల్ కాలేజ్‌లో మొదటిరోజు అడుగుపెట్టిన లతకు ఎదురైన చేదు అనుభవం అది. ఆమె మనసు కలత చెందింది. పశ్చాత్తాప పడింది కూడా, తండ్రి 'ఎవర్నైనా పంపిస్తానమ్మా నీతో' అంటే 'వద్దు' అని వచ్చినందుకు.

"అవునా? మాకు పాఠాలు నేర్పటానికి వచ్చావా? చదువుకోవటానికి వచ్చావా?" అంటూ ఒకతను లతకు దగ్గరగా వచ్చాడు.

"భలేగా వున్నావు సినిమా యాక్టర్‌లా చూస్తుంటే వదలబుద్ధికావటం లేదు. అమ్మీ ఏ వూరేంటి మనది?" అంటూ మీద మీదకు వస్తున్న మరొకతడిని చేత్తో వెనక్కి నెట్టింది లత.

"కర్నూలు. మీరు తప్పు చేస్తున్నారు. చదువుకుందాం, డాక్టర్లమవుదాం అన్న ఆశతో, లక్ష్యంతో వచ్చిన వాళ్ళని ఇలా మీద పడి తోడేళ్ళ గుంపులా వేధిస్తుంటే ఎలా చదువుకుంటారు? రాగింగ్ పేరుతో ఎందర్ని బలితీసుకుంటారు?"వెళ్ళిపోబోతున్న లతకు చెయ్యి అడ్డుపెట్టాడు అతడు,

"కర్నూలు అంటే వణికిపోతాం అనుకున్నావా? మరి ఇంతదూరం వచ్చావేంటి?" అంటూ.

లత కళ్ళలో నీళ్ళు నిండాయి. "ప్లీజ్, నన్ను వెళ్ళనివ్వండి" అంది బ్రతిమాలుతూ.

"అయితే ఒక పని చేద్దాం. చిన్న డాన్స్ చేస్తే వదిలేస్తాం" అంటూ ఫోన్‌లో పాట ఆన్ చేశాడు మరొకతడు.

ఆ పాటతోపాటు స్వరం కలుపుతూ, అందరూ కూడా "రింగోలా...రింగోలా" అని గోలగా పాడుతూ లత చుట్టూ తిరిగి కేరింతలు కొడుతున్నారు. వాళ్ళతో అమ్మాయిలు కూడా ఉన్నారు.

"డాన్స్ బేబీ డాన్స్" అంటూ లత చేతిని అందుకుని స్టెప్పులు వేస్తూ బిగ్గరగా అరిచాడతడు.

"నాకు డాన్స్ రాదండీ" అంది కోపాన్ని అణచుకుంటూ.

"నేను నేర్పిస్తానుగా రా" అంటూ ఆమె చెయ్యిపట్టుకుని గిర్రున తిప్పాడు అతడు.

పడబోయి ఆపుకొంది లత. పిన్ ఊడిపోయి జారిపోతున్న పల్లూను కంగారుగా సర్దుకుంటున్న లతకు దగ్గరగా వచ్చి పల్లూ పట్టుకు లాగింది ఒక అమ్మాయి.

"మేము ఇంతకంటే వరస్ట్ రాగింగ్ ఫేస్ చేసామమ్మా" అంటూ.

"నువ్వు ఆడదానివి కాదూ?" అంటూ ఆ అమ్మాయి చెంప ఛెళ్ళుమనిపించింది లత.

"అది చూద్దామనే.. అయినా కొడతావా ఒక సీనియర్‌ను. నీ కర్నూలు పవర్ మాకు చూపిద్దాం అనుకుంటున్నావా? దమ్ముంటే నన్ను కొట్టవే" అంటూ దగ్గరగా వచ్చాడు అతడు.

"ఒక కాబోయే డాక్టర్వి. అదా మాట్లాడేది. నీ ఇంట్లో చూస్తున్నావా? రేపు డాక్టర్‌గా అదే చూస్తావా? ఛీ మనుషులా, పశువులా? అంటూ అక్కడ్నించి వేగంగా వెళ్ళబోయిన లత చెయ్యిని గట్టిగా పట్టి చెయ్యినొప్పి పుట్టి కీచుగా అరిచింది లత.

అపుడే వస్తున్న సీనియర్ మెడికో హేమంత్ బైక్‌కు స్టాండ్ వేసి వేగంగా వచ్చాడు.

"ఏమైంది?" అంటూ వాళ్ళ మధ్యకు వెళ్ళాడు అతడు.

"ఇది చాలా పొగరుగా మాట్లాడుతుంది హేమంత్. మనకు రాగింగ్‌కు డెఫినిషన్ నేర్పిస్తుంది. సుజాత చెంపమీద కొట్టింది.

"నాకు సారీ చెప్పవే" అరిచింది సుజాత దగ్గరగా వచ్చి.

"కొంచెం ఆగండి దయచేసి" అంటూ సురేష్ చేతిలో వున్న లత చేతిని విడిపించాడు హేమంత్.

"ప్లీజ్ సురేష్ ఇక చాలు. వెళ్ళనియ్యి" అన్నాడు.

"అదేం కుదరదు. సారీ చెప్పాలి, వెళ్ళాలి" అన్నాడు సురేష్. అందరూ ఏక కంఠంతో అరుస్తున్నారు" సే సారీ..సే సారీ" అంటూ.

లత కళ్ళలో నీళ్ళు చూసిన హేమంత్‌కు బాధనిపించింది.

'పాపం, తాకితే కందిపోయేంత సున్నితంగా వుంది. ఇంత బాధపెడుతున్నారు' అనిపించింది సహజంగా మృదుస్వభావం గల హేమంత్ కు.

లతకు దగ్గరగా వెళ్ళాడు హేమంత్ "ప్లీజ్ సారీ చెప్పండి" అన్నాడు ఆమెకే వినిపించేటంత నెమ్మదిగా.

"నేను తప్పు చేస్తే చెప్పాలి" అంటూ హేమంత్ ముఖంలోకి చూసిన లత మౌనంగా ఉండిపోయింది.

"ప్లీజ్" అతడి కళ్ళు అర్థిస్తున్నాయి ఆమెను.

మనసు అంగీకరించకపోయినా అతడి మాటకు విలువనిచ్చింది ఆమె.

"సారీ..సారీ" అంది గట్టిగా.

"మాకు వినపడలేదు" అన్నాడు సురేష్.

మరొక్కసారి హేమంత్ ముఖంలోకి చూసిన లత.

"సారీ..సారీ" అని బిగ్గరగా అరిచింది కోపంగా.

తన ముఖంలోకి చూస్తున్న హేమంత్‌కు ఆమె అప్రయత్నంగా "థాంక్ యు" అని చెప్పింది.

ప్రభుత్వం పట్ల నిరసనను తెలుపుతూ ప్రతి పక్షాలు బంద్‌ను నిర్వహిస్తున్నాయి. రోజూ ట్రాఫిక్‌తో కిటకిటలాడే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

అయినా మెడికల్ కాలేజ్‌కు చాలామంది అటెండయ్యారు. సాయంత్రం వెళిపోతూ అప్రయత్నంగా బస్‌స్టాండ్ వైపు చూశాడు హేమంత్. బైక్‌ను ఆపాడు.

బస్‌స్టాప్‌లో నిలబడి వుంది లత.

"ఆ రోజు రాగింగ్ గొడవలో అమ్మాయేగా అనుకున్నాడు.

నెమ్మదిగా యు టర్న్ తీసుకుని, రోడ్‌కు అటువైపున ఉన్న బస్‌స్టాప్ దగ్గర ఆపాడు బైక్‌ను.

ఆమె, అతడివైపు ఒకసారి చూసి, మళ్ళీ రోడ్డు చివరి వరకు చూస్తూ నిలబడింది.

"ఈ రోజు బస్‌లు రావు, ఆటోలు దొరకవు. ఎలా?" అన్నాడు ఆమెను ఉద్దేశించి.

"ఏమో ఎలాగో మరి" అంది ఆమె. నవ్వేశాడూ హేమంత్.

"నాకు మీ పేరు తెలియదు ఎడ్రస్ చెయ్యటానికి. మీకు అభ్యంతరంలేకపోతే నేను డ్రాప్ చేస్తాను రండి" అన్నాడు.

ఒకసారి అతడివైపు చూసింది.

నిర్మానుష్యంగా ఉన్న రోడ్డువైపు చూస్తూ "ఏదీ దొరకదంటారా?" అంది.

"దొరకదేమో.. ఏమో ఎలాగో మరి, నే వెళ్ళిపోతే ఇబ్బంది పడతారేమో?" అన్నాడు.

తను అన్న మాటలనే అతడు కావాలని అనుకరించాడని గమనించింది ఆమె. నెమ్మదిగా బైక్ దగ్గరకు వెళ్ళింది.

"నా పేరు లత. మీ పేరు?" అంది చిరునవ్వుతో.

"హేమంత్" చెప్పాడతడు.

"నేను మధురవాడలో హాస్టల్‌లో ఉంటాను. మరి మీకు కన్వీనియంటో కాదో?" అంది లత సంశయంగా.

"ఫర్వాలేదు. ఎక్కడైనా డ్రాప్ చేస్తాను, రండి" అన్నాడు ముందుకు జరుగుతూ.

ఆమె చేతిలో కొంచెం పెద్దగా ఉన్న హ్యాండ్ బ్యాగ్‌తో ఎక్కబోతుంటే "బ్యాగ్ ఇలా ఇవ్వండి, ఎదర పెడతాను" అన్నాడు చెయ్యి చాపి.

"థాంక్యూ" అంటూ ఇచ్చింది

"ఇప్పుడు ఫ్రీగా కూర్చోండి" అంటూ బైక్‌ను స్టార్ట్ చేశాడతడు.

కొంచెం దూరం వెళ్ళాక కుక్క ఒకటి రోడ్‌కు అడ్డంగా పరిగెత్తటంతో సడన్ బ్రేక్ వేశాడతడు.

ఆమె ఆ కుదుపుతో ముందు హేమంత్‌కు తగిలి పక్కకు జారిపోబోయింది. చటుక్కున ఆమెను ఎడమ చెత్తో కాసి, పడిపోకుండా ఆపాడు హేమంత్.

"మీరు పడివుంటే దెబ్బ తగిలేది. దయచేసి అలా గాలిలో కూర్చున్నట్టు కూర్చోకండి. కాస్త ఏదైనా పట్టుకు కూర్చోండి."

"ఇక్కడ ఏమీ.." ఆమెకు మధ్యలోనే అడ్డు వచ్చాడు హేమంత్.

"పడిపోయేటపుడు నా భుజం పట్టుకున్నా పదరుగా."

"అవును" అంది సర్దుకు కూర్చుంటూ.

"ఓకేనా?" అని అడిగి ఆమె "ఊ" అన్నాక బైక్‌ను ముందు పోనిచ్చాడతడు.

నెమ్మదిగా అతడి భుజంపై చెయ్యివేసి ఇబ్బందిగా కూర్చుంది లత. ఆమెను హాస్టల్ దగ్గర డ్రాప్ చేసి, "బై లతా" అన్నాడు.

"థాంక్యూ హేమంత్. బై" అంది.

"వెల్‌కం" అంటూ వెళ్ళిపోయాడతడు.

వెళ్ళినంత వేగంగాను వెనక్కు వచ్చాడు హేమంత్.

"లతా" అనగానే మెట్లెక్కుతున్న లత వెనక్కి తిరిగి చూసింది. బైక్ దగ్గరకు వచ్చింది వేగంగా.

"మీ బ్యాగ్" అంటూ అందించాడతడు.

"అయ్యో మర్చిపోయాను. ఇంకా దూరం వెళ్ళాక గుర్తు రాలేదు మీకు" అంది చిరునవ్వుతో బ్యాగ్ అందుకుంటూ.

"అప్పుడు రేపు కాలేజ్‌లో ఇచ్చేవాడిని" అన్నాడు.

"నా సెల్, ఇంకా కొన్ని నాకు అవసరమైనవి ఇందులోనే ఉంటాయి" అంది.

"మళ్ళీ థ్యాంక్స్ చెప్పకండి" అన్నాడు నవ్వుతూ.

"చెప్పకపోతే ఎలా? థాంక్స్" అంటూ నవ్వేసింది లత.

"ఈ అమ్మాయి నవ్వు బాగుంది" అనుకున్నాడు హేమంత్.

కాలేజ్ టైం అయిపోయాక పార్కింగ్‌లో నుంచి బైక్‌ను తీసుకుంటున్న హేమంత్, ఎవరో పిలిచినట్టై వెనుతిరిగి చూశాడు.

తొందరగా అడుగులు వేస్తూ దగ్గరకు వచ్చింది లత.

"మీరు నన్ను పిలిచారా లతా?" అడిగాడు హేమంత్.

"అవునండీ" అంది.

"ఏంటి, డ్రాప్ చెయ్యమంటారా?" అడిగాడు.

"ఊహూ, కాదు. నాకు ఫిజియాలజీ అండ్ ఎనాటమీ టెక్స్ట్ బుక్స్ కావాలి. స్టాక్ లేదన్నారు. సెమిస్టర్ దగ్గర పడుతుంది. నేను తీసుకున్నాక మీ బుక్స్ రిటర్న్ చేస్తాను."

"రేపు తీసుకోండి, తెస్తాను."

"సరే, థాంక్స్ అండీ" అంటూ వెను తిరిగింది.

"డ్రాప్ చెయ్యనా లతా?" బైక్ స్టార్ట్ చేస్తూ అడిగాడు.

ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయింది లత.

"సరే టేక్ కేర్" అంటూ వెళ్ళిపోబోతున్న హేమంత్‌ను

"ఆగండి, వస్తాను" అంటూ ఆపింది.

ఆమె చేతిలో బ్యాగ్‌ను, కోట్‌ను "ఇవ్వండి" అంటూ తీసుకుని ముందు పెట్టాడు.

అతడు ముందుకు జరిగాడు "ఎక్కండి" అంటూ.

ఎక్కి కూర్చుంది లత.

"మధురవాడే కదూ?" అడిగాడు.

"అవును" అంది సర్దుకు కూర్చుంటూ.

"లతా.. ఇది బ్రహ్మచారి బండి. శారీగార్డ్ వగైరాలు ఉండవు. జాగ్రత్తగా కూర్చోవాలి" చెప్పాడు చిన్నగా నవ్వుతూ.

నవ్వేసి, "ఓకె" అంటూ సర్దుకు కూర్చుంది.

"గాలిలో కూర్చోకండి దయచేసి" అన్నాడు.

అర్థమైంది లతకు. నెమ్మదిగా అతడి భుజంపై చేతిని ఆనీ ఆనకుండా వేసి కూర్చుంది.

కొంత దూరం వెళ్ళాక "హేమంత్, కొంచెం బైక్‌ను ఆపండి" అంది

బ్రేక్ పడింది బైక్‌కు.

దిగిన లతను "ఏమైంది లతా?" అని అడిగాడు.

"ఒక్క ఫిఫ్టీన్ మినిట్స్ అంతే. సూపర్ మార్కెట్‌లోకి వెళ్ళి వచ్చేస్తా. మీకు లేట్ అవుతుంది అంటే వెళ్ళిపోండి."

"అంత అర్జెంట్ పని ఏమీలేదుగాని, పదండి నేనూ వస్తాను." అంటూ బైక్‌ను పార్కింగ్‌లో పెట్టి ఆమె వెంట వెళ్ళాడు.

లత బిస్కట్స్, బ్రెడ్, ఫ్రూట్స్ తీసుకుంది.

"అయిపోయిందా?" అడిగాడు.

"అయింది" అంటూ బిల్ కౌంటర్ దగ్గరకు వెళ్ళింది లత.

హేమంత్ తొందరగా వెళ్ళి రెండు ప్యాకెట్స్ తెచ్చి, అవికూడా బాస్కెట్‌లో ఉంచాడు.

"ఏంటివి?" అంటూ తీసి చూసిన లత, "వేఫర్సా?" అంది.

"రెండూ మీకు కాదు ఒకటి నాకు" అన్నాడు నవ్వుతూ.

బిల్ పే చేసి బయటకు వచ్చారు.

"నాకు చిన్నప్పట్నుంచీ వేఫర్స్ చాలా ఇష్టం" అన్నాడు హేమంత్.

"నాకూ ఇష్టమే. కానీ మీ అంత కాదు" అంది.

"అంటే.. నాకంటే ఇష్టం కాదనా?" అన్నాడు.

"నేను వేఫర్స్ గురించే చెప్పాను" తడబడింది లత.

"నేనూ అదే అడిగాను" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"లతా కొంచెం ఆగండి" అన్నాడు, వెళ్ళిపోయి బైక్ దగ్గర నిలబడిన లతతో.

"ఎందుకు? మీకు ఇంకేమైనా పనుందా?" అంటు వెనక్కు వచ్చింది.

"లతా, ఇక్కడ పక్కనే మంచి కాఫీ షాప్ ఉంది. కాఫీ తాగుదామా?" అడిగాడు హేమంత్.

లతకు 'వద్దు' అనబుద్ధి కాలేదు.

"సరే" అంటూ అతడి వెంత నడిచింది.

కాఫీ షాప్‌లో నీట్‌గా ఉన్న ఒక కార్నర్ టేబుల్ దగ్గరకు నడిచాడు అతడు. ఇద్దరూ కూర్చున్నారు.

వెయిటర్‌కు స్నాక్స్ ఏవో చెప్పాడు హేమంత్.

"హేమంత్, మిమ్మల్ని చూస్తే తెలుగు అబ్బాయిలా అనిపించరు" లత చిన్నగా నవ్వుతూ అంది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS